క్లుప్తంగా

షాదీఖానా నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి



వొడితెల ప్రణవ్‌తో ముస్లిం నాయకులు

హుజూరాబాద్‌రూరల్: షాదీఖానా నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ మండలంలోని సింగాపూర్ గ్రామంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్‌కు కబ్రస్తాన్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్, ముస్లిం నాయకులు వినతిపత్రం సమర్పించారు. 30 సంవత్సరాల క్రితం అప్పటి ప్రభుత్వం 20 గుంటల భూమి కేటాయించిందని, ఆ భూమిలో షెడ్డు నిర్మాణం నిర్మించగా, ప్రస్తుతం ధ్వంసమైందని, దాని స్థానంలో షాదీఖానా నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆలయ అభివృద్ధికి దాతలు సహకరించాలి

చొప్పదండి: శ్రీవేంకటేశ్వర మణికంఠ ఆలయ అభివృద్ధికి దాతల సహకారం కొనసాగించాలని ఆలయ కమిటీ చైర్మన్ బొడిగె వెంకటేశ్ గౌడ్ కోరారు. బుధవారం ఆలయంలో జరిగిన కమిటీ సమావేశంలో మాట్లాడారు. తొమ్మిదేళ్ల తర్వాత ఆలయానికి కలర్స్ వేయించి లైటింగ్ ఏర్పాటు చేయడంతో వార్షికోత్సవాలు శోభాయమానంగా జరగడానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. అయ్యప్ప మాల ధారణ భక్తుల కోసం రూ.20 లక్షల వరకు విరాళాలు సేకరించి, శాశ్వత అన్నదాన ట్రస్టు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆలయ కమిటీకి సంబంధం లేకుండా ఎవరైనా పత్రికా ప్రకటనలు ఇవ్వద్దని, కమిటీదే తుది నిర్ణయమని తెలిపారు. 22న సమావేశం ఏర్పాటు చేసి వార్షికోత్సవ ఆదాయ వ్యయాలపై చర్చించనున్నామని, అయ్యప్ప భక్తులు హాజరు కావాలని కోరారు. సమావేశంలో పొరండ్ల భాస్కర్, మామిడాల నిరంజన్, ఎలిగేటి రాములు, దండె సత్యానందం, చేపూరి సత్యనారాయణ, ఎన్నం మునిందర్, గుర్రం శ్రీనివాస్ రెడ్డి, సిరిపురం శ్రీనివాస్, చల్ల అనూష్, అర్చకులు పాలోజు చరణాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న లచ్చన్న

గంగాధర: మండలంలోని గర్శకుర్తి గ్రామానికి చెందిన పంపు డ్రైవర్ ప్రమాదంలో గాయపడడంతో ఆయన కుటుంబానికి రూ.పదివేలు, గుర్రం హరిప్రసాద్ మృతి చెందడంతో ఆయన కుటుంబానికి తూడి లచ్చన్న బుధవారం రూ.పదివేలు అందజేశారు. గర్శకుర్తి గ్రామ యువసేన సభ్యులు సమాచారం అందజేయడంతో ఆయా కుటుంబాలను పరామర్శించి ఆర్థికసాయం చేశామన్నారు.

'ఓడిపోతామనే విమర్శలు'

గంగాధర: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతోనే కాంగ్రెస్ పార్టీ నాయకులు బీజేపీపై విమర్శలు చేస్తున్నారని బీజేపీ చొప్పదండి నియోజకవర్గ కన్వీనర్ పెరుక శ్రావణ్‌కుమార్ అన్నారు. కనీస అర్హత లేని నాయకులు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్‌పై విమర్శలు చేస్తున్నారని, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గతంలో టీఆర్ఎస్ పార్టీకి అమ్ముడుపోయిన విషయంతో ముందస్తుగా బండి సంజయ్‌కుమార్ హెచ్చరిక చేశారని, దీనికి కాంగ్రెస్ నాయకులు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని, కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో ఎంపీగా బండి సంజయ్‌కుమార్ రూ.9 వేల కోట్ల తో పలు అభివృద్ధి పనులు చేసిన విషయం ప్రజలకు తెలుసని పేర్కొన్నారు. శ్రీరాముడి అక్షింతల విషయంలో కూడా నీచమైన మాటలు మాట్లాడటం సరికాదన్నారు. మళ్లీ నరేంద్రమోదీ ప్రధాని కావడం తథ్యమని పేర్కొన్నారు.

ఎరువుల గోదాంలు, స్టాక్ రిజిష్టర్లు తనిఖీ



తనిఖీ చేస్తున్న ఏవో వంశీకృష్ణ

చొప్పదండి: మండలంలోని రుక్మాపూర్, వెదురుగట్ట, భూపాలపట్నం గ్రామాలలో ఏర్పాటు చేసిన చొప్పదండి పీఏసీఎస్ ఎరువుల గోదాములు, స్టాక్ రిజిష్టర్‌లను ఏవో వంశీకృష్ణ బుధవారం తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ రైతులు దుక్కిలోనే భాస్వరం ఎరువులు వేసుకోవాలని, పైపాటున వేయొద్దని ఆయన సూచించారు.

ప్రయాణం.. ప్రమాదకరం

- రోడ్డుపై తేలిన కంకర, వాహనదారుల తంటాలు
- తరుచూ ప్రమాదాలకు గురవుతున్నా పట్టించుకోని వైనం
- అసంపూర్తి పనులకు మోక్షమెన్నడో?
- ఎమ్మెల్యే హామీ ఫలించేనా



గంగాధర: మూడేళ్లుగా అసంపూర్తి పనులతో వాహనదారులకు, అటు వైపు వెళ్లే రైతులకు ఇబ్బందిగా తయారైన హిమ్మత్‌నగర్ రోడ్డు పనులకు ఇప్పటికైనా మోక్షం లభిస్తుందా అని గ్రామస్తులు ఎదురు చూస్తున్నారు. ఇటీవల జరిగినా అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రతి పక్షాలకు రోడ్డు సమస్య ఈ ప్రాంత ఓట్లు రాబట్టడానికి ప్రచారస్త్రమైంది. తాను గెలిస్తే అసంపూర్తి పనులు పూర్తి చేయిస్తానని హామీ ఇచ్చిన కాంగ్రెస్ అభ్యర్థి మేడిపల్లి సత్యం ఎమ్మెల్యేగా గెలుపొందాడు. ఇప్పుడైనా పనులు ప్రారంభిస్తారని వెదిర, హిమ్మత్‌నగర్, రంగరావుపల్లి గ్రామాల ప్రజలు ఆశాతో ఉన్నారు. మండలంలోని కురిక్యాల-గర్శకుర్తి ప్రధాన రహదారిలో ఉప్పరమల్యాల గ్రామ శివారు నుంచి హిమ్మత్‌నగర్ గ్రామం ద్వారా రామడుగు మండలం వెదిర గ్రామం కరీంనగర్-జగిత్యాల ప్రధాన రహదారి వరకు 6.65 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం ద్వారా రూ.3.76 కోట్ల నిధులు మంజూరయ్యాయి. రోడ్డు పనులకు 2021లో టెండర్లు నిర్వహించారు. టెండరు వచ్చిన కాంట్రాక్టర్ 2021 జూలై 28న అగ్రిమెంటు చేసుకున్నాడు. పనులు ప్రారంభించి రెండేళ్లు గడిచినా పనులు పూర్తి కావడం లేదు. రామడుగు మండలం వెదిర, గంగాధర మండలం హిమ్మత్‌నగర్ గ్రామాల పరిధిలో సీసీరోడ్లు, మురుగు కాలువ పనులు పూర్తి చేశాడు. మిగిలిన రోడ్డుపై తారు వేయడానికి దొడ్డు, సన్న కంకర పోసి రోలింగ్ చేసి వదిలేశారు. కొద్ది నెలలుగా కంకర రోడ్డుపైనే వాహనాల రాకపోకలు సాగుతుండటంతో కంకర తేలి ప్రయాణం ప్రమాదకరంగా మారింది. కంకర రోడ్డుపై తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రోడ్డుపై మూడుకార్లు అదుపు తప్పి బోల్తా కొట్టిన సంఘటనలున్నాయి. రోడ్డుపై తేలిన కంకరను తప్పించే క్రమంలో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ రోడ్డు వెంట పంట పొలాలకు వెళ్లే రైతులు నడవడానికి అవస్థలు పడుతున్నారు. వాహనాలు వెళ్తుంటే రాళ్లు ఎగిరొచ్చి తాకుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు బాగుందని వాకింగ్ చేసిన వెదిర, హిమ్మత్‌నగర్ గ్రామస్తులు కంకర తేలడంతో వాకింగ్ బందు చేశారు. వెంటనే తారు రోడ్డు పనులు ప్రారంభించి పూర్తి చేయాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.

నడవడానికి ఇబ్బంది



కంకర తేలిన హిమ్మత్‌నగర్ రోడ్డుపై నడవడానికి తంటాలు పడాల్సి వస్తోంది. ప్రతిరోజు ఇదే రోడ్డు వెంట పంటపొలాల వద్దకు వెళ్లాలి. చిన్నచిన్న కంకరరాళ్లు రోడ్డుపై తేలి ఉండటంతో నడుస్తుంటే కాళ్లు నొప్పులు పుడుతున్నాయి.

– ప్రభాకర్‌రెడ్డి, రైతు, వెదిర

రోడ్డు మొత్తం దుమ్ము



వెదిర గ్రామ శివారు నుంచి హిమ్మత్‌నగర్ గ్రామం వరకు రోడ్డుపై మొత్తం కంకర తేలింది. మొదట్లో పెద్దపెద్దగా ఉన్నరాళ్లు పక్కకు పోయాయి. ఇప్పుడు చిన్నకంకర తేలింది. ఈ రోడ్డు పంటపొలాల వద్దకు వెళ్లాలంటేనే భయమేస్తోంది.

– చంద్రయ్య, హిమ్మత్‌నగర్

లారీ డ్రైవర్ల సమ్మె



జమ్మికుంట: నిరసన వ్యక్తం చేస్తున్న లారీ డ్రైవర్లు

హుజూరాబాద్: కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన హిట్ అండ్ రన్ కొత్త చట్టాన్ని పూర్తిగా తొలగించాలని డిమాండ్ చేస్తూ హుజూరాబాద్ లారీ డ్రైవర్స్ అండ్ క్లీనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కేసీ క్యాంపులోని అసోసియేషన్ కార్యాలయం వద్ద సమ్మె నిర్వహించారు. అనంతరం కరీంనగర్ -వరంగల్ ప్రధాన రహదారిపై కొద్దిసేపు ధర్నా చేశారు. డ్రైవర్లకు గులాబీ పువ్వులిచ్చి వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ... హిట్ అండ్ రన్ కేసులో డ్రైవర్‌కు పదేళ్ల జైలుశిక్ష, రూ. 7 లక్షల పైగా జరిమానా విధించాలని తెచ్చిన చట్టంతో డ్రైవర్లు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని, జైలుశిక్ష పడితే పదేళ్లపాటు డ్రైవర్ల కుటుంబాలకు దూరంగా ఉండాల్సి వస్తుందని, వారి కుటుంబాలు రోడ్డున పడతాయని పేర్కొన్నారు. రూ. ఏడు లక్షల జరిమానా చెల్లించడం సాధ్యం కాదని, నిబంధనతో కొత్తవారు వృత్తి చేపట్టేందుకు ముందుకురారని, శిక్షతోపాటు జరిమానా కూడా తగ్గించాలని డిమాండ్ చేశారు. లేదంటే పూర్తిగా చట్టాన్ని తొలగించాలన్నారు. ఆందోళనలో లారీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎండీ సలీం, కార్యదర్శి ఎండీ మాజీద్, ఉపాధ్యక్షుడు ఎండీ జానీ, నాయకులు జగన్నాథం, ఎండీ సజ్జు, రమేశ్, తిరుపతి, హైమద్, రషీద్, రాంప్రసాద్, జగన్నాథం, మల్లయ్య, శంకరయ్య, హరి శంకర్, మోహిన్, శ్రీను, అరవింద్, డ్రైవర్లు పాల్గొన్నారు.

ఎఫ్‌సీఐలో...

జమ్మికుంట: హిట్ అండ్ రన్ కేసులో డ్రైవర్లకు కఠిన శిక్షను వ్యతిరేకిస్తూ పట్టణంలోని ఎఫ్‌సీఐలో లారీ డ్రైవర్, క్లీనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్టీరింగ్ చోడో ఉద్యమం కొనసాగించాలని బుధవారం నిరసన, ఆందోళన వ్యక్తం చేశారు. కొత్త చట్టం ద్వారా తమ జీవితాలు చిన్నాభిన్నం అవుతాయని, హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లారీలను అన్‌లోడ్ చేయమని నిరసన వ్యక్తం చేయగా పట్టణ సీఐ బార్పటి రమేశ్ సంఘటన స్థలానికి చేరుకొని అన్‌లోడ్ చేయించి సమస్య పరిష్కరించారు. ఈ సందర్భంగా జమ్మికుంట లారీ డ్రైవర్స్, క్లీనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మాట్లాడారు. రేపటి నుంచి సమ్మె కొనసాగిస్తామని అధికారులకు తెలియజేశామన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు రవి, సాల్లేటి రఘుతోపాటు కరీంనగర్ చెందిన లారీ డ్రైవర్లు పాల్గొన్నారు.



హుజూరాబాద్: వరంగల్-కరీంనగర్ ప్రధాన రహదారిపై ధర్నా చేస్తున్న లారీ డ్రైవర్లు

కేంద్ర పథకాలు వినియోగించుకోవాలి



జమ్మికుంట: మాట్లాడుతున్న అధికారులు, నాయకులు



గంగాధర: మాట్లాడుతున్న మేఘరాజు

జమ్మికుంట: పట్టణంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశాల మేరకు వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్టేట్ బ్యాంక్ మేనేజర్ సోమశేఖర్, మున్సిపల్ మేనేజర్ భూపాల్‌రెడ్డి, మెప్మా టీఎంసీ మల్లీశ్వరి, బీజేపీ జిల్లా ఉపాధ్యాక్షుడు సంపత్‌రావు, పట్టణ అధ్యక్షుడు జీడీ మల్లేశ్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. పేదలకు కోసం కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పీఎంఎస్‌వీఏ నిధి కార్యక్రమం ద్వారా ఇప్పటి వరకు 2014 మంది లోన్ పొందిన లబ్ధిదారులకు ఇన్సూరెన్స్ స్కీం ఉపయోగపడుతుందన్నారు. బేటి బచావో, బేటి పడావో, ముద్ర, వ్యవసాయరుణాలు, ఆయుష్మాన్ భారత్, తదితర వాటిపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శిరీష, డాక్టర్ అనిత, సీనియర్ అసిస్టెంట్ భాస్కర్, నోడల్ ఆఫీసర్ రవీందర్, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సదానందం, మహేశ్, వార్డు ఆఫీసర్లతోపాటు సీఎల్ఆర్పీలు జ్యోతి, మంజుల, ఆర్పీలు, పారిశుధ్య కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

గంగాధర: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించడం కోసం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర మండలంలోని వెంకటాయపల్లి గ్రామంలో బుధవారం నిర్వహించారు. సమావేశంలో సర్పంచ్ శ్రీమల్ల మేఘరాజు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ పథకాలు, ఇతర కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పలు శాఖల అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గడువు పొడిగింపు

చొప్పదండి: సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ప్రవేశానికి గడువు ఈ నెల 20వ తేదీ వరకు పొడిగించినట్టు ప్రిన్సిపాల్ స్వాతి తెలిపారు. ప్రస్తుతం నాల్గో తరగతి చదువుతున్న విద్యార్థులు అవకాశం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఫిబ్రవరి 11న ప్రవేశ పరీక్ష ఉంటుందని, ఒకే సెల్‌నంబర్‌తో ఒకే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తప్పుడు సమాచారం అందిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్



శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ కుమారస్వామి తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని సంబంధిత గ్రామాల ప్రజలు సహకరించాలని కోరారు.

సెల్‌ఫోన్ అందజేత

వీణవంక: మండలంలోని ఘన్ముక్కుల గ్రామానికి చెందిన బత్తుల రాజయ్య ఇటీవల సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా పోలీసులు సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకొని బుధవారం రాజయ్యకు అప్పగించామని ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. అనంతరం రాజయ్య పోలీసులకు కృతజ్ఞతలు తెలిపాడు.

బడీడు పిల్లలను పనిలో పెట్టుకోవద్దు

హుజూరాబాద్: బడీడు పిల్లలను పనిలో పెట్టుకోవద్దని చైల్డ్ హెల్ప్ లైన్ 1098 జిల్లా కో ఆర్డినేటర్ సంపత్ అన్నారు. ఆపరేషన్ స్మైల్ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఇటుక బట్టీలు, రెస్టారెంట్, హోటళ్లు, దుకాణాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలకార్మిక నిర్మూలన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం బాలకార్మిక చట్టాల గూర్చి వివరించారు. వెంట హుజూరాబాద్ లేబర్ ఆఫీసర్ చందన, బాలల పరిరక్షణ అధికారి రమేశ్, చైల్డ్ హెల్ప్ లైన్ కేసు వర్కర్ ప్రియాంక, పోలీస్ కానిస్టేబుల్ రవీందర్, యజమానులు తదితరులు పాల్గొన్నారు.

భరతమాత చిత్రపటానికి పూజలు



పూజలు చేస్తున్న ధర్మజాగరణ సమితి సభ్యులు

రామడుగు: మండలంలోని గుండి గ్రామంలో ధర్మ జాగరణ సమితి ఆధ్వర్యంలో బుధవారం భరతమాత చిత్రపటానికి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. గ్రామంలోని పోచమ్మ దేవాలయం వద్ద ప్రత్యేకంగా భారతమాత చిత్రపటానికి పూజలు నిర్వహించి, భరతమాత గొప్పతనం గూర్చి ధర్మ జాగరణ సమన్వకర్త పాకాల రాములుగౌడ్ వివరించారు. కార్యక్రమంలో సమితి సభ్యులు రేణుకుంట శంకరయ్య, పొన్నం శ్రీనివాస్‌గౌడ్, ఆశన్న, రాములు, అంజన్న, పలువురు పాల్గొన్నారు.

అయోధ్య చరిత్ర భావితరాలకు తెలియాలి



సంచికను ఆవిష్కరిస్తున్న ఆర్ఎస్ఎస్ బాధ్యులు

తిమ్మాపూర్: అయోధ్య రామ మందిర్ నిర్మాణం కోసం హైందవ జాతిపై జరిగిన అకృత్యాలను, రామ మందిరం పునర్నిర్మాణ చరిత్రను భావితరాలకు తెలియజేయాలని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ విభాగ్ శారీరక్ ప్రముఖ్ సామల కిరణ్, విభాగ ప్రచార ప్రముఖ్ శంకరయ్య సూచించారు. అయోధ్య రామ మందిరంలో ఈనెల 22న విగ్రహ ప్రాణప్రతిష్ట ఘట్టం జరగనున్న నేపథ్యంలో గ్రామాల్లోని ఆలయాల్లో మహత్తర కార్యక్రమాన్ని భక్తులు వీక్షించడానికి, చేపట్టాల్సిన ఏర్పాట్ల కోసం తిమ్మాపూర్ మండలం కొత్తపల్లిలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం తిమ్మాపూర్ ఖండ (తిమ్మాపూర్, చిగురుమామిడి, గన్నేరువరం మండలాలు) సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడారు. అయోధ్యలో రాముని గుడి నిర్మాణానికి ఎన్నో అడ్డంకులు ఎదురయ్యాయని, ఎంతోమంది ప్రాణత్యాగాలు, కోర్టు వివాదాలు, రాజకీయ పార్టీల కుతంత్రాలు, అయోధ్య రామ మందిరం పూర్తి సమాచారం, ఇతరత్రా అంశాలను జాగృతి ప్రత్యేక సంచికలో పూర్తి స్థాయిలో పొందుపరిచామని తెలిపారు. సంచికను ప్రతీ ఒక్కరూ చదవాలని, జాగృతి ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ట కార్యక్రమం సందర్భంగా ప్రతీ ఇంటిలో ఐదు దీపాలు వెలిగించి ఊరంతా దీపావళి పండుగను తలపించేలా ఏర్పాట్లు చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యావహ కొండేటి బాలరాజు, సహ కార్యవహ గుత్తికొండ రాజశేఖర్, పుల్లూరి రామారావు, సందీప్, దరిపెల్లి నర్సింగారావు, ఆవుల కుమార్, వినీత్ కొంటు సంపత్, వివిధ క్షేత్రాలకు సంబంధించిన ముఖ్య కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్, డైరీని ఆవిష్కరిస్తున్న ఎస్‌టీవో

హుజూరాబాద్‌రూరల్: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ క్యాలెండర్, డైరీని బుధవారం ఎస్‌టీవో మోయిజ్‌జహాన్ ఆవిష్కరించారు. అనంతరం జిల్లా శాఖ అధ్యక్షుడు, గౌరవ అధ్యక్షులు చందుపట్ల జనార్దన్, కట్ట నాగభూషణాచారి మాట్లాడుతూ ప్రతినెల 1వ తేదీన పెన్షన్ చెల్లించాలని, పెండింగ్‌లోని మూడు డీఏలను మంజూరు చేయాలన్నారు. నూతన పీఆర్‌సీని వెంటనే ప్రకటిస్తూ జూలై 2023 నుంచి అమలు చేయాలని, ఈహెచ్ఎస్ స్కీమ్‌ను అమలుచేస్తూ.. స్పెషల్ పే రిటైర్డ్ ఉపాధ్యాయులకు నేషనల్ ఇంక్రిమెంట్ మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ బాధ్యులు ఇల్లందుల సమ్మయ్య, మండల వీరస్వామి, గరిగె చంద్రయ్య, చొగ్లెటి మల్లారెడ్డి, పరాంకుశం సనత్‌కుమార్, రామకృష్ణయ్య, గుండేటి మొగిలయ్య, రామకృష్ణ, బుచ్చిరాజం, వి.భాస్కర్, అమరేందర్, కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్ రాజిరెడ్డి తదితరులు ఉన్నారు.

పారువెల్ల చెరువును పరిశీలించిన అధికారులు



పరిశీలిస్తున్న డీఈ ఆంజనేయులు

గన్నేరువరం: మండలంలోని పారువెల్ల పెద్ద చెరువును నీటితో నింపాలని రైతులు, ముదిరాజ్ సోదరులు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను కోరారు. ఈసందర్భంగా ఎంపీపీ లింగాల మల్లారెడ్డి, ఇరిగేషన్ అధికారులను చెరువును నీటితో నింపుటకు ఎమ్మెల్యే పురమాయించారు. బుధవారం ఇరిగేషన్ డీఈ ఆంజనేయులు చెరువును నింపుటకు క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులను పరిశీలించారు. అనంతరం జిల్లాస్థాయి అధికారులకు సమస్య విన్నవించారు. ఈకార్యక్రమంలో అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి, మాజీ ప్యాక్స్ చైర్మన్ కోటి, సర్పంచ్‌లు నరసింహారెడ్డి, దుడ్డు రేణుక, ఏఈలు మహేందర్, రాజుకుమార్, నాయకులు వేణు, తిరుపతి, రాజయ్య, స్వామి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెంచాలి

మానకొండూర్: గర్భిణుల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయించాలని మానకొండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి గోపాల్ హెల్త్ అసిస్టెంట్లు, ఆశా కార్యకర్తలకు సూచించారు. మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లోని ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ అందుబాటులో ఉండాలని, చిన్నపిల్లలకు వ్యాక్సినేషన్ చేయించాలని కోరారు. ప్రభుత్వాసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్ వో రాజునాయక్, తదితరులు పాల్గొన్నారు.

వరి పొలాల పరిశీలన

కరీంనగర్‌రూరల్: వరి పంటలో ఆశిస్తున్న మొగి పురుగు నివారణకు 3జీ కార్బోఫ్యూరాన్ గుళికలను వినియోగించాలని సహాయ వ్యవసాయ సంచాలకుడు కె.రణధీర్‌రెడ్డి రైతులకు సూచించారు. మొగ్దుంపూర్, చెర్లభూత్కూర్‌లో ఏఈవో స్వర్ణలతతో కలిసి వరి పొలాలను పరిశీలించారు. వరి పంటలో ఆశిస్తున్న తెగుళ్లను రైతులనడిగి తెలుసుకున్నారు. మొగి పురుగు ఆశిస్తే గుళికలను వినియోగించాలని, ఎక్కువ మోతాదులో యూరియా వాడొద్దని సూచించారు. చెర్లభూత్కూర్‌లో ఇజ్జగిరి శ్రీనివాస్ సాగు చేసిన బెండ తోటను సందర్శించారు. బెండ సాగు విధానం, సస్యరక్షణ చర్యలపై రైతుకు అవగాహన కల్పించారు.

సమగ్ర విచారణ చేపట్టాలి

కరీంనగర్‌రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుట్ర చేస్తున్నాడంటూ ఎంపీ బండి సంజయ్ వెల్లడించిన విషయాలపై సమగ్ర దర్యాప్తు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ జిల్లా కమిటీ మాజీ ప్రధాన కార్యదర్శి పెంచాల లక్ష్మణ్‌రావు రాష్ట్ర పోలీస్ ఉన్నతాధికారులను కోరారు. బుధవారం లిఖితపూర్వక ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి రాష్ట్ర ప్రభుత్వాన్ని కూల్చివేయాలని కేసీఆర్ చేస్తున్న కుట్ర తనకెలా తెలిసిందో సంజయ్ బయటపెట్టాలని డిమాండ్ చేశారు. కుట్రకు సంబంధించిన ఆధారాలను పోలీసులకివ్వాలని సూచించారు. 2014, 2019 ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్‌తో పాటు ఇతర పార్టీల ఎమ్మెల్యేలను బీఆర్ఎస్‌లో కేసీఆర్ చేర్చుకున్నారని ఆరోపించారు.

డిపాజిట్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న సుమిత

రామడుగు: కరీంనగర్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు తీసుకువచ్చిన సహకార క్రాంతి నూతన డిపాజిట్ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని గంగాధర సహకార బ్యాంకు మేనేజర్ అమరావతి సుమిత కోరారు. మండలంలోని వెదిర గ్రామంలో ఆమె మాట్లాడారు. నూతన పథకం ద్వారా బ్యాంకులో డిపాజిట్ చేస్తే 546 రోజులకు 7.50 శాతం, సీనియర్ సిటిజన్స్‌కు 8 శాతం వడ్డీ అందజేయడం జరుగుతుందని తెలిపారు. బ్యాంకు ద్వారా స్వల్ప, దీర్ఘకాలిక రుణాలతో పాటు విదేశీ విద్యా రుణం, బంగారు ఆభరణాలపై రుణాలు అందిస్తామని అవకాశాలను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

అవగాహన సదస్సు



మాట్లాడుతున్న ఎంపీపీ రవీందర్

చొప్పదండి: పోస్ట్ ఆఫీస్ రికరింగ్ డిపాజిట్లు, తపాలా బీమా, ఇండియా పోస్టు పేమెంట్స్ బ్యాంకు ఖాతా, సురక్ష బీమా యోజన, జీవన్ జ్యోతి బీమా యోజన, సుకన్య సమృద్ధి ఖాతా, పీపీఎఫ్ వంటి కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ చిలుక రవీందర్ కోరారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో కేంద్ర ప్రభుత్వ పథకాలపై బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో పోస్టల్ సూపరింటెండెంట్ శివాజీ, సబ్ పోస్టు మాస్టర్ రమేశ్, ఐపీపీ మేనేజర్ రాజేశ్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్‌ను విమర్శిస్తే ఊరుకోం'

మానకొండూర్: కాంగ్రెస్ పార్టీని విమర్శిస్తే ఊరుకోబోమని మానకొండూరు మండల యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ముక్కెర సతీశ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాజీ ఎంపీ బండి సంజయ్ కుమార్ మతం పేరుతో ఓట్లు అడగడం మానుకోవాలని సూచించారు. కరీంనగర్ ఎంపీగా జిల్లాలోని ఆలయాలకు ఎన్ని నిధులు తెచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు.

రక్తదానం 23సార్లు..

కరీంనగర్‌రూరల్: కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న చొప్పదండి మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ భర్త గాలన్నకు అవసరమైన ఓ ప్లస్ రక్తాన్ని బొమ్మకల్‌కు చెందిన సామాజిక సేవకుడు ఆసిరి ఆంజనేయులు అందించారు. ఇటీవల అత్తగారు మృతిచెందినా.. మానవతా దృక్పథంతో ఆంజనేయులు 23వసారి రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారు.